విఠలాపురం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల గదులకు పడిన రంధ్రాలు

వరండా చదువులు

- శిథిలావస్థకు చేరిన పాఠశాలలు
- కూలిపడుతున్న పైకప్పులు
- కూలిన కట్టడాల్లోనే బోధన

మల్దకల్, జూన్ 10 : మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 10 ఉన్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ప్రాథమిక పాఠశాలలు 26, ఒక కస్తూర్బా విద్యాలయం ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి 5,455 మంది విద్యార్థులు ఉన్నారు. మండలంలోని విఠలాపురం, ఉల్గొపల్లి, అడవిరావుల చెర్వు తదితర గ్రామాల్లో పురాతన భవనాల్లోనే విద్య కొనసాగుతోంది. వర్షాకాలంలో నీళ్లు లీకేజీ అయ్యి విద్యార్థులు కూర్చోవటానికి కూడా వీల్లేకుండా గదులు ఉన్నాయి. అంతే కాకుండా పైకప్పు ఊడిపడుతున్నది. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఎప్పుడు ఏ భవనం కూలిపడుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. అధికారులు స్పందించి పిల్లల జీవితాలతో ఆటలాడకుండా సర్కారు బడుల్లో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

కుర్తిరావుల చెర్వు ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో వరండాలో కూర్చున్న విద్యార్థులు (ఫైల్)

చదువు.. సాగేదెలా?

అలంపూర్ చౌరస్తా, జూన్ 10 : ఏ క్షణంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంతో విద్యార్థులు చదువులు సాగించాల్సిన దుస్థితి. ఉండవల్లి మండలంలో ఇటిక్యాలపాడు ప్రాథమికోన్నత పాఠశాల పూర్తిగా శిథిలావ్యవస్థకు చేరింది. తక్కశిల ప్రాథమికోన్నత పాఠశాల ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. మండలంలోని 16 గ్రామాల్లో పాఠశాలలు ఇలాగే ఉన్నాయి.

తక్కశిల ప్రాథమికోన్నత పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న వంటగది

ఇటిక్యాలపాడులో పాఠశాలలో కూలిపోయిన ప్రహరి

ధరూరులోని ప్రాథమిక పాఠశాలలో ప్రహరీపై కూలిపడిన వేపచెట్టు ప్రహరీగోడపై కూలిపోయిన వేప చెట్టును పట్టించుకోని అధికారులు.

బడి భద్రమేనా?

- శిథిలావస్థకు చేరిన పాఠశాలలు
- ధరూరు ప్రాథమిక పాఠశాలలో ఒరిగిన చెట్టు
- భయం గుప్పిట్లో విద్యార్థులు, టీచర్లు

ధరూరు, జూన్ 10 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో ప్రమాదం పొంచి ఉన్నది. పాఠశాల ఆవరణలోని వేప చెట్టు భారీగా పెరిగి ఒరిగి ఉండడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ప్రహరీపై పడడంతో నెర్రలు బారింది. అసలే వర్షాకాలం కావడంతో ఈదురుగాలులకు చెట్టు ఎప్పుడు విరిగి పడి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు మదనపడుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మేల్కొని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాలల రక్షణ అందరి బాధ్యత

- సీడీపీవో హేమలత

మాట్లాడుతున్న సీడీపీవో హేమలత

గట్టు, జూన్ 10 : బాలల పరిరక్షణ అందరి బాధ్యతని సీడీపీవో హేమలత అన్నారు. మండలంలోని ఇందువాసిలో మహిళా శిశు సంక్షేమశాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలలపై వేధింపులు, ఆకృత్యాలు, హింస జరగకుండా బాలల పరిరక్షణ కమిటీలు చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరుగకుండా నిరోధించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో చెన్నయ్య, నీతి ఆయోగ్ జిల్లా కోఆర్డినేటర్ అష్జల్, బాలల సంరక్షణ జిల్లా అధికారి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పనిలో పెట్టుకుంటే చర్యలు

ధరూరు, జూన్ 10 : బాలబాలికలందరూ పాఠశాలలో ఉండాలని, పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేశ్ అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దపాడులో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

అయిజ, జూన్ 10 : బాల్య వివాహాలను నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని ఉత్తనూర్ గ్రామంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

వనపర్తి టౌన్, జూన్ 10 : జిల్లా కేంద్రంలోని కోర్టు సముదాయంలో ఈ నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ వాల్‌పోస్టర్లను మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత ఆవిష్కరించారు. ప్రజలు, కక్షిదారులు శాంతి, రాజీమార్గంలో సత్వర పరిష్కారం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు రజిని, కవిత, కళార్చన, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

వడ్డేపల్లి, జూన్ 10 : భూభారతితో రైతులు భూసమస్యలను పరిష్కరించుకోవాలని అధికారులు సూచించారు. మంగళవారం తనగలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 22మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ వీరభద్రప్ప, డిప్యూటీ తాసీల్దార్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

సోలీపూర్, మల్కాపూర్‌లో..

ఖిల్లాఘణపురం, జూన్ 10 : భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ సుగుణ తెలిపారు. మంగళవారం మండలంలోని సోలీపూర్, మల్కాపూర్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులతో కలిసి ఆమె పాల్గొన్నారు.

40 దరఖాస్తులు..

గట్టు, జూన్ 10 : మండలంలోని రాయాపురంలో రెవెన్యూ సదస్సును మంగళవారం నిర్వహించారు. 40 దరఖాస్తులను తాసీల్దార్ మదన్ మోహన్‌గౌడ్, డిప్యూటీ తాసీల్దార్ విజయ్‌కుమార్ స్వీకరించారు.

విద్యార్థులను సర్కారు బడిలో చేర్పించాలి

అలంపూర్, జూన్ 10 : మండలంలోని క్యాతూరులో ఎంఈవో అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. మహిళా సంఘాలు సిద్ధం చేసిన యూనిఫాంలను ఉపాధ్యాయులు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మావతి, ఏపీఎం ప్రవీణ, సీసీ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు సుధాకర్, నర్గీస్, బాలామణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మెరుగైన విద్య

అయిజ రూరల్, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సింగిలి విండో మాజీ చైర్మన్ రాముడు అన్నారు. మంగళవారం మండలంలోని సంకాపురంలో బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ, మాజీ ఉపసర్పంచ్ ఈశ్వర్ పాల్గొన్నారు.

బడుల్లో ఉండాల్సిందే

గట్టు, జూన్ 10 : బడీడు పిల్లలు బడుల్లో ఉండాలని ఎంపీడీవో చెన్నయ్య అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంఈవో నల్లారెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలలే మేలు..

వనపర్తి టౌన్, జూన్ 10 : ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య అందుతుందని జీహెచ్ఎం గణేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం చిట్యాల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

పెద్దమందడి, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని హెచ్ఎం, ఉపాధ్యాయులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని జంగాల కాలనీ, గంగపుత్ర కాలనీలో ఇంటింటికి వెళ్లి పాఠశాలకు సంబంధించిన కరపత్రాన్ని అందించారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

వనపర్తి టౌన్, జూన్ 10 : జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూలు, అర్హత లేకుండా బోధన చేయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేశ్ విద్యాశాఖ అధికారులు వినతిపత్రాన్ని అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వడ్డేపల్లి, జూన్ 10 : శాంతినగర్‌లో గురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపా రు. శాంతినగర్‌కు చెందిన అమర్‌నాథ్(53) గత నెల 29న పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూల్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తకోట, జూన్ 10 : భర్త వేధింపులు తాళలేక విషం తాగి చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని అప్పరాలలో చోటుచేసుకున్నది. ఎస్సై ఆనంద్ కథనం ప్రకారం.. పాలెం గ్రామానికి చెందిన రాములు తన రెండో చెల్లెలు సువర్ణ అలియాస్ శాంతమ్మ(36)ను అప్పరాల గ్రామానికి చెందిన రవితో 2003లో వివాహం జరిపించారు. రవి మేస్త్రీ పని చేసేవాడు. వీరికి ఒక కూతురు, కుమారుడు సంతానం. వివాహం జరిగి 13ఏండ్లయినా భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. శాంతమ్మను అనుమానిస్తూ ఉండడంతో మనస్తాపానికి గురైన శాంతమ్మ ఈ నెల 8వ తేదీన విషం తాగి మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సన్న రకం వడ్లనే పండించాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ సురభి

పెబ్బేరు మండలం శాఖాపురంలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెబ్బేరు, జూన్ 10 : ప్రభుత్వం సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నందునా రైతులు దొడ్డు రకం వడ్లకు స్వస్తి చెప్పి సన్నరకామే పండించాలని కలెక్టర్ ఆదర్శ సురభి అన్నారు. మంగళవారం ఆయన పెబ్బేరు మండలం కంచిరావుపల్లిలో రైతు నేస్తం, శాఖాపురంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు వేదికల్లో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. పంటల సాగు, మెళకువలు తెలుసుకొని మంచి దిగుబడులు సాధించాలని తెలిపారు. అలాగే, భూ సమస్యల పరిష్కారానికి భూభారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంతో కాలంగా పరిష్కారం కాని సమస్యలకు దరఖాస్తులు ఇస్తే నెల రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం కంచిరావుపల్లిలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ తనిఖీ చేసి లైసెన్సు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వనపర్తి ఆర్డీవో సుబ్రమణ్యం, డీటీ నందకిషోర్, ఆర్ఐ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రావుల జన్మదిన వేడుకలు

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ధనూష్

కొత్తకోట, జూన్ 10 : తెలంగాణ భవన్ ఇన్‌చార్జి, బీఆర్ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు కానాయపల్లిలో నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పటాకులు కాల్చారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు ధనూష్ కొత్తకోట ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, డాక్టర్ మంజుశ్రీ, డాక్టర్ శ్రావణి, సూపర్‌వైజర్ ప్రమీల, శాంతన్న, శేఖర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, రాజు, గోవర్ధన్, రాజు, లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

రైతులనుకున్నారా లేక టెర్రలిస్టులనుకున్నారా..?

అయిజ, జూన్ 10 : ఇథనాల్ కంపెనీ వల్ల నష్టపోతున్నామని కడుపు మండిన రైతన్నలు కంపెనీ పరికరాలను ధ్వంసం చేస్తే కేసులు పెట్టి జైళ్లకు పంపడంలో పాలకుల ఆంతర్యమేమిటని టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ కార్యదర్శి సుధాకర్‌గౌడ్ ప్రశ్నించారు. అయిజలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి వెన్నెముక రైతు అని గొప్పలు చెబుతూ ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ 12 గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో నిరసనలు, పోరాటలు చేస్తుంటే వారిపై ఉక్కుపాదం ఎందుకు మోపుతున్నారని నిలదీశారు. రైతులపై కేసులు పెట్టడమంటే చేతగాని పాలన కారణంగా సిగ్గుతో తలదించుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు భీమన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు స్టాండ్, చేతికర్రల పంపిణీ

స్టాండ్, చేతి కర్రలను అందజేస్తున్న మహేశ్

కొత్తకోట, జూన్ 10 : మండలంలోని రామనంతపురానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేశ్ జన్మదిన వేడుకల సందర్భంగా కనిమెట్టకు చెందిన 80మంది వృద్ధులకు స్టాండ్, చేతికర్రలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరమేశ్, మాజీ వైస్ ఎంపీపీ బాలరాజు, నరసింహ, యాదయ్య, లింగానాయక్, పరశురామ్ పాల్గొన్నారు.

వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష

అమరచింత, జూన్ 10 : మద్యం తాగి వాహనం నడిపిన కేసులో వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష పడినట్లు ఆత్మకూర్ ఏఎస్సై రోశయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారం రోజుల కిందట ఆత్మకూర్‌లోని మహాత్మాగాంధీ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా అమరచింత మండలం మస్తీపూర్‌కు చెందిన రాములు మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడన్నారు. ఆత్మకూర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపర్చడంతో వనపర్తి జూనియర్ సివిల్ జడ్జి శ్రీలత రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లుగా ఏఎస్సై తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మాట్లాడుతున్న శాస్త్రవేత్త లక్ష్మమ్మ

గోపాల్‌పేట, జూన్ 10 : రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు సురేశ్‌కుమార్, లక్ష్మమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని మున్ననూర్‌లో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు వానకాలం పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సమగ్ర వ్యవసాయం, పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము, వరి, ఆముదం, కూరగాయ పంటల సాగులో మెలకువల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి విజయ భాస్కర్‌రెడ్డి, ఐఎఫ్ఎఫ్‌సీవో రాజు, వ్యవసాయ విస్తరణ అధికారి హరీశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణానికి సహకరించాలి

ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

అయిజ, జూన్ 10 : ప్లాస్టిక్ రహిత పట్టణానికి ప్రజలు సహకరించాలని ఇన్విరాన్మెంటల్ ఇంజినీర్ సురేశ్ కోరారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేధించడం జరిగిందని, అయినా కొందరు వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జవాన్లు ప్రకాశ్, సురేందర్, ఆనంద్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గోపాల్‌పేట, జూన్ 10 : ఏదులకు చెందిన గుణమోని రాములు(47) వ్యవసాయ కూలీ. మంగళవారం డబ్బుల విషయమై ఇంట్లో గొడవపడి వెళ్లిపోయాడు. మనస్థాపానికి గురైన అతడు పెద్ద గుట్ట వద్ద పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

అభివృద్ధి పనులపై విచారణ చేపట్టాలి

గట్టు, జూన్ 10 : గట్టులో తాజా మాజీ సర్పంచ్ ధనలక్ష్మి హయాంలో జరిగిన అభివృద్ధి పనులపై విచారణ చేపట్టాలని మాజీ సర్పంచ్ మోహన్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకుంఠధామం నిర్మాణపు పనులను నాసిరకంగా చేపట్టడంతో షెడ్డు పైకప్పు గాలికి ఎగిరిపోయిందని, పల్లెప్రకృతి వనాన్ని అధికారులు చూస్తే పరిస్థితి ఏమిటనేది అర్థమవుతుందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బజారి, నాయకులు రామకృష్ణారెడ్డి, రాజు, తిమ్మప్ప పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

వనపర్తి టౌన్, జూన్ 10 : వనపర్తి జిల్లాలో కేజీబీవీ పాఠశాలలు, యూఆర్ఎస్‌లో పనిచేస్తున్న వంట నిర్వాహకులకు కామన్ మెనూ ప్రకారం వంటలు తయారు చేసే విధానంపై శిక్షణ నిర్వహించినట్లు జిల్లా బాలికల విద్యాభివృద్ధి అధికారి శుభలక్ష్మి తెలిపారు. ఖిల్లాఘణపురం, గోపాల్‌పేట తదితర పాఠశాలల్లో పనిచేసే వంట నిర్వాహకులు ఈ శిక్షణకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్ ఘనీ, ఎంఈవో మధుసూదన్ రెడ్డి, ఏఎంవో మహానంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మద్దకల్, జూన్ 10 : విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో సురేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు, వంట ఏజేన్సీలతో సమావేశం నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

అయిజ, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రత అందరి బాధ్యతని జిల్లా సెక్టోరియల్ అధికారి శాంతిరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాలోని పారిశుధ్య కార్మికులు, మధ్యాహ్న భోజన సిబ్బంది, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

శానిటేషన్ సిబ్బందికి శిక్షణ

పాన్‌గల్, జూన్ 10 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి మండల రిసోర్స్‌పర్సన్ రామదాసు శానిటేషన్ క్లీనింగ్‌పై అవగాహన కల్పించారు.

పౌష్టికాహారం అందించాలి

ఎర్రవల్లి చౌరస్తా, జూన్ 10 : విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని మండల విద్యాశాఖ అధికారి అమీర్‌పాషా అన్నారు. ఎర్రవల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్న భోజనంపై శిక్షణ ఏర్పాటు చేశారు.

అయిజ : మాట్లాడుతున్న జిల్లా సెక్టోరియల్ అధికారి శాంతిరాజు

నిధులు, వాటాలు ఖచ్చితంగా అందించాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

వనపర్తి టౌన్, జూన్ 10 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ఎస్సీ, ఎస్టీలకు రావాల్సిన వాటాలు ఖచ్చితంగా వారికే అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ కమీషన్ బృందం సభ్యులు వనపర్తి జిల్లా పర్యటన సందర్భంగా ఐడీవోసీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, జిల్లా అధికారులు, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జిల్లాలోని ముఖ్యమైన శాఖల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన వాటా వివరాలపై ఆరా తీశారు. ప్రతి నెల 30వ తేదిన పౌర హక్కుల దినోత్సవాన్ని విధిగా నిర్వహించాలని, అందుకు ప్రణాళికలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 1చ300 ఇండ్లు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించినట్లు కలెక్టర్ చెప్పారు. నల్ల చెరువుకు అంబేద్కర్ పేరు పెట్టడం జరిగిందని, అక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నామని కలెక్టర్ వివరించారు. అదేవిదంగా 19 ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కాగా 18 చార్జి షీట్లు ఫైల్ చేయడం జరిగిందని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

అలంపూర్, జూన్ 10 : అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఎస్సీ, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, నీలాదేవి, రాంబాబు నాయక్, రెణికుంట్ల ప్రవీణ్‌తో కలిసి వెంకటయ్య అలంపూర్ జోగుళాంబ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వీరి వెంట ఆర్డీవో అలివేలు, డీఎస్పీ మొగులయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్‌బాబు, ఈవో పురేందర్, తాసీల్దార్ మంజుల పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీ రద్దుకు డిమాండ్

గద్వాల టౌన్, జూన్ 10 : ప్రజల ప్రాణాలను హరించే ఇంథనాల్ పరిశ్రమ ఏర్పాటును రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం రాజకీయ, సామాజిక, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద ధన్వాడ గ్రామాన్ని సందర్శించడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రజల ప్రాణాలను హరించే పరిశ్రమ నెలకొల్పకుండా అనుమతి రద్దు చేయాలన్నారు. రాజకీయ, ప్రజాసంఘాల నాయకులను గ్రామానికి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అనాలోచిన నిర్ణయాన్ని విరమించుకోవాలని సూచించారు. సమావేశంలో నాయకులు ఎక్బాల్‌పాష, ఆంజనేయులు, నరసింహ, సుభాన్, రహమాన్, రంగన్న, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వాలు

వనపర్తి టౌన్, జూన్ 10 : దేశంలో, రాష్ట్రంలో జర్నలిస్టుల స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ అన్నారు. మంగళారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సమావేశ భవనంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా మూడో మహాసభలు అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. జర్నలిస్టుల సంక్షేమానికి సర్కారు పాటుపడాలన్నారు. హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో రామకృష్ణ, మాణిక్ ప్రభు, పరిపూర్ణం, రాంచందర్, రమేశ్, సురేశ్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జూటూరు రాము, కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా సురేందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, రవీందర్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా బాబు, బక్కిబాబు, నాగభూషణం, కోశాధికారిగా శ్రీనివాసులు, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా వెంకటేశ్, ఈసీ మెంబర్లుగా రాము, విష్ణు, గోపాల్, విష్ణువర్ధన్, వెంకటేష్‌నాయక్, రవికుమార్‌చారి, మన్మోహన్, బాలకృష్ణ, రంజిత్, రాష్ట్ర కౌన్సిల